క్లుప్తంగా

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు

కోదాడరూరల్: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగిన 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ పోటీల్లో కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభకనబరిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం. నాగు తెలిపారు. కేఆర్ఆర్ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదుతున్న పి.కృష్ణవేణి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించి టీం గెలుపులో కీలకపాత్ర పోషించి బంగారు పథకాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కోచ్‌లుగా వ్యవహరిస్తున్న నామా నాగేశ్వరరావు, తురక రమేష్, ఇన్‌చార్జ్ పీడీ ఎస్.రామారావులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న నల్లబోలు సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చిలుకూరు: మండల పరిధిలోని నారాయణపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న నల్లబోలు సంజీవ్‌రెడ్డి ఉచితంగా స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం నల్లబోలు సంజీవ్‌రెడ్డిని పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, గ్రామ కార్యదర్శి సారిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలగొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులకు సన్మానం



సంపత్‌రెడ్డి, శరణ్యను సన్మానిస్తున్న 3వ వార్డు ప్రజలు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి దంపతులను మూడో వార్డు ప్రజలు ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని లక్కవరంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీటీసీ రణపంగు కాశమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చామకూరి గురుపాదం, చామకూరి మధు, చనగాని సైదులు, రామయ్య, కోటయ్య, నర్సింహారెడ్డి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం: మండల కేంద్రంలో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం జిల్లా పరిషత్ సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘాల చైర్మన్, జెడ్పీటీసీ బాణాల కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గుండు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, గ్రామశాఖ అధ్యక్షుడు బోళ్ల నర్సిరెడ్డి, నాయకులు పందిరి వెంకటరెడ్డి, గడ్డం మల్లేష్, కాసాని వెంకన్న పాల్గొన్నారు.

నేల ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడి

నడిగూడెం: నేల ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడి వస్తుందని సిరి ఫౌండేషన్ ప్రతినిధి మొలుగూరి రజిని తెలిపారు. సోమవారం నడిగూడెం మండల పరిధిలోని శ్రీరంగాపురం, చాకిరాల గ్రామాల్లో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం వలన భూసారం దెబ్బతింటుందన్నారు. ప్రతి రైతు ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. అనంతరం భూసారం పెరిగేందుకు జీవామృతం, ఘన జీవామృతం, చీడపీడల నివారణ కోసం నీమాస్త్రం, వేప గింజల కషాయం, వేప ఆకు కషాయం, వావిలాకు, తూటికాడ కషాయాల తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

అదనంగా రూ.10కోట్లు మంజూరు

- తిరిగి ప్రారంభంకానున్న మునగాల– కీతవారిగూడెం రోడ్డు పనులు



మునగాలలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

మునగాల: మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు 20కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. నిధుల కొరతతో మునగాల మండల కేంద్రం నుంచి గణపవరం గ్రామం వెలుపల వరకు సుమారు 4.6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసింది. నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదలేశాడు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు అసంపూర్తి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చొరవతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులతో సంప్రదించి అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు మరో రూ.10కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతె గత రెండు రోజులుగా బెంగళూరుకు చెందిన సాత్విక్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ప్రతినిధుల బృందం అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డుకు సర్వే నిర్వహిస్తున్నారు. మునగాల మండల కేంద్రం నుంచి గణపవరం గ్రామం వెలుపల వరకు సుమారు 4.6కిలోమీటర్ల మేర, కీతవారిగూడెం గ్రామ సరిహద్దులో 500మీటర్ల రోడ్డు పనులకు టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మునగాల మండలం కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది. అగ్రిమెంట్ పూర్తయిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– బి. సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ

సమస్యల పరిష్కారానికి సహకరించాలి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. సోమవారం మోతె మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయలంలో ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతన అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిదులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించి అక్కడే ఉన్న సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సమావేశంలో భాగంగా మోతె మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని ఎంపీపీ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో స్వస్తిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ దోసపాటి నాగయ్యన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీ హరిసింగ్, సూపరింటెండెంట్ వెంకటాచారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు 200 పనిదినాలు కల్పించాలి



వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాలు అందజేస్తున్న మట్టిపల్లి సైదులు

మునగాల: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలను 200 పనిదినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో అనేక గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటడంతో పనులు లేక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు గాను ఉపాధి హామీ పథకంలో భాగంగా 200 పనిదినాలు కల్పించాలని కోరారు. అంతేకాకుండా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాలువ ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సత్యం, సొంపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, జంపాల స్వరాజ్యం, రావులపెంట వెంకన్న, కేవీపీఎస్ జిల్లా నాయకులు నందిగామ సైదులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల పార్వతీ రామలింగేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి



డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న యాజమాన్యం, కార్మికులు

పాలకవీడు: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రతీ కార్మికుడు భద్రతా ప్రమాణాలు పాటించాలని పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఆయన పరిశ్రమలో 53వ జాతీయ గనుల భద్రతా వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 10 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ సీజీఎం ఎస్. నాగమల్లేశ్వరరావు, సేఫ్టీ కమిటీ జనరల్ సెక్రటరీ పీఎస్ రావు, వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



చిలుకూరు: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి

చిలుకూరు: చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లో సోమవారం తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్యాస్ సబ్సిడీ, జీరో కరెంట్ బిల్లులు రాని వారు ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లో మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కరోజులో 80 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, టైపిస్ట్ పద్మజా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకునేందుకు వీలుగా నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ డి. సోమసుందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులు మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విజయకుమారి, సూపరింటెండెంట్ విజయనిర్మల, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది సంధ్యారాణి తదితరులున్నారు.

కబడ్డీ పోటీల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీల కరపత్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పురుషులు, మహిళల విభాగాల్లో రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు నిర్వహించన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో పోశం వీరారెడ్డి, కబడ్డీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శంకర్‌రెడ్డి, గురవారెడ్డి, మంద రవి, నరేంద్ర, నిరంజన్, సాయికిరణ్‌రెడ్డి, నాగరాజు, దామెర సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

మునగాల జెడ్పీటీసీ సభ్యురాలిగా జ్యోతి



దేశిరెడ్డి జ్యోతి

మునగాల: ప్రస్తుతం మునగాల జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్న నల్లపాటి ప్రమీలపై అనర్హత వేటు పడింది. ఇకపై జెడ్పీటీసీ సభ్యురాలిగా మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన దేశిరెడ్డి జ్యోతి కొనసాగనున్నారు. 2019మేలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సీపీఎం పార్టీ అభ్యర్థి దేశిరెడ్డి జ్యోతిపై టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లపాటి ప్రమీల పోటీ చేసి విజయం సాధించారు. కాగా నల్లపాటి ప్రమీల విజయం చెల్లదంటూ 2019లో హుజుర్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టును దేశిరెడ్డి జ్యోతి ఆశ్రయించారు. 1995మే 31తర్వాత ముగ్గురు సంతానం ఉంటే పోటీ చేయకూడదని,అది చట్టవిరుద్ధమని ఎన్నికల కమిషన్ స్పష్టంగా పేర్కొంది. నామినేషన్ పత్రంలో తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి ఎన్నికల బరిలో నిలబడి అధికార పార్టీ అండదండలతో విజయం సాధించాని జ్యోతి కోర్టులో కేసు దాఖలు చేశారు. వాదోపవాదాలు జరిగిన తర్వాత హుజుర్‌నగర్ కోర్టు ఈనెల 5న నల్లపాటి ప్రమీల ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇచ్చి ఆమెపై అనర్హత వేటు వేసి దేశిరెడ్డి జ్యోతిని జెడ్పీటీసీగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చిది. కోర్టు తీర్పును గౌరవిస్తూ ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు దేశిరెడ్డి జ్యోతిని జెడ్పీటీసీగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రెండో రోజూ ‘పల్స్ పోలియో’



హుజూర్‌నగర్: బస్సులో వెళ్తున్న బాలుడికి పోలియో చుక్కలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో రెండో రోజు సోమవారం కూడా మొబైల్ టీంల ద్వారా పోలియో చుక్కలు వేశారు. అంగన్‌వాడీ టీచర్లు బస్టాండ్ వద్ద, ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం కూడా ఇంటింటికి తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు నవ్య, సునీల మాట్లాడుతూ.. చిలుకూరు మండలంలో 100 శాతం పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

మునగాల: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కల్యాణోత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇనుగుర్తి వీరాచారి తెలిపారు. అనంతరం జ్యోతిప్రజ్వలన, అఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పరణ హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నిత్య పూజలు, ఆరగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అదేరోజు రాత్రి 9.30గంటలకు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేదీన మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం, 10వ తేదీన నిత్యపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని వేపలసింగారంలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం, గరుడసేవ, గ్రామోత్సవం, పవళింపుసేవ, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలను చేశారు. తదనంతరం అన్నమయ్య కీర్తనలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సారెడ్డి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ అన్నెం వెంకటరెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, చక్కెర వీరారెడ్డి, గోపిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూలకంటి రంగారెడ్డి పరామర్శ

మఠంపల్లి: మఠంపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చింతా శేషగిరిరాజు సతీమణి లక్ష్మమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. లక్ష్మమ్మ భౌతికకాయం వద్ద మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నివాళులర్పించి శేషగిరిరాజును పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని కోరారు. పేదలకు వెంటనే తెల్ల రేషన్ కార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాండునాయక్, బాలునాయక్, హుస్సేన్, శ్రీను, రన్‌మియా, రాము, కోటయ్య, లింగమ్మ, వెంకటరెడ్డి, లింగయ్య, అశోక్ తదితరులున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

కోదాడరూరల్: పట్టణ పరిధిలోని కొమరబండ శాలివాహన బజార్‌లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి నిధులతో సోమవారం బోరు వేయించారు. ఈ పనులను మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాపారావు, లింగరాజు, రాజయ్య, సతీష్, ఉపేందర్ ఉన్నారు.

తాగునీటి ఎద్దడికి పరిష్కారం చూపాలి

నేరేడుచర్ల: మండలంలో తీవ్రంగా ఉన్న తాగునీటి ఎద్దడికి పరిష్కారం చూపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు కోరారు. సోమవారం నేరేడుచర్ల మండలం పుల్లంబండ తండాతో పాటు పలు తండాలను సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ధనుంజయనాయుడు మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు పుల్లంబండ తండాను సందర్శిస్తే తాగునీటి ఎద్దడి ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. మంత్రి ఉత్తమ్ స్పందించి సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయించి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల, పాలకీడు మండలాల సీపీఐ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి, ముక్కజానయ్య, నేరేడుచర్ల పట్టణ పార్టీ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం

కోదాడరూరల్: మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో గల సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అన్నెం చినవెంకట్‌రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న సీతయ్య తదితరులు

కోదాడరూరల్: కోదాడ పీఏసీఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఓరుగంటి శ్రీనివాసరెడ్డిని కోదాడ మాజీ సర్పంచ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పారసీతయ్య ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సైదానాయక్, పాలూరి సత్యనారాయణ, కంబాల ప్రసాద్, దాసు, చింతలపాటి శేఖర్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గరిడేపల్లి: హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో తరగతి గదులను, 1, 3 వార్డులు, సబ్ హెల్త్ సెంటర్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాసరావు, డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.



సబ్ హెల్త్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

హుజూర్‌నగర్‌రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ లావణ్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఎక్కడా పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. గ్రామాలల్లో బోరు మోటారు సమస్యలుంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు తుమ్మల శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, శ్యామల, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొత్తగూడెంలో ముత్యాలమ్మ బోనాలు

మోతె: మండలంలోని కొత్తగూడెంలో సీతారామస్వామి దేవాలయం నాల్గో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ముత్యాలమ్మకు గ్రామస్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీలం శీను అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో హమాలీ వర్కర్స్, పంచాయతీ కార్మికులు, స్వీపర్లు, బిల్డింగ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో గోపి, నాగరాజు, నరసరావు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, వెంకన్న, సైదులు, నరేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

హుజూర్‌నగర్: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఫస్టియర్ మ్యాథ్స్ పేపర్–ఏ, పరీక్షకు 270 మంది విద్యార్థులకు గాను 247 మంది హాజరయ్యారు. అదేవిధంగా ప్రియదర్శిని కళాశాలలో 388 మంది విద్యార్థులకు గాను 367 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల: నేరేడుచర్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య కోరారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించి నేరేడుచర్ల మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మిల్లులపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్: జిల్లాలో కస్టమ్ మిల్లుడ్ రైస్(సీఎంఆర్) ఇవ్వని రైస్ మిల్లులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోమగాని నరేందర్ సోమవారం ప్రకటనలో కోరారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు ఇచ్చారని.. కానీ మిల్లర్లు ఆ ధాన్యాన్ని సీఎంఆర్‌గా మార్చి ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా మార్కెట్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. 2022–23 వానాకాలానికి సంబంధించి 6లక్షల టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించలేదని అన్నారు.

ఆర్థికసాయం అందించాలి

మునగాల: మోతె మండల కేంద్రం శివారులో గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరేల్లి బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మునగాలలో మాట్లాడుతూ.. మునగాల మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన నలుగురు, రేపాల గ్రామానికి చెందిన ఇద్దరు కూలీలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారని, ప్రమాదం జరిగి వారం రోజులవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేలా కృషిచేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

హుజూర్‌నగర్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దివంగత ఎన్టీ రామారావు ఆశయ సాధనకు ప్రతి టీడీపీ కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె. వెంకటేశ్వర్లు, రోషపతి, రాములు, నాగయ్య, వెంకటయ్య, కనకరత్నం, మేకల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్ల వీరయ్యకు నివాళి

మఠంపల్లి: మండలంలోని యాతవాకిల్లలో సోమవారం నిర్వహించిన పిల్లుట్ల వీరయ్య సంతాప సభకు ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, జాజిరెడ్డిగూడెం వైస్ ఎంపీపీ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ హాజరై వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వీరయ్య సేవా దృక్పథం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. వీరయ్య కుమారుడు రఘు ఓజో ఫౌండేషన్ పేరుతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, ఎల్లావుల నాగయ్యయాదవ్, కృష్ణ, ప్రకాష్, వెంకన్న, కాశయ్య, లచ్చయ్యగౌడ్, ఎల్లయ్యగౌడ్ తదితరులున్నారు.